# ★ వెలిగీ వెలగని దివ్వెలు ★

ప్రశాంత సాయంత్రం. డాబామీద నేనూ అమ్మ, అత్తయ్యా, మామయ్య కూర్చొనిఉన్నాము. అందరిముఖాల్లో గాంభీర్యం తాండవించుతోంది. "ఊఁ! ఇహ చెప్పరా నీవిషయం....." అన్నాడు మామయ్య. ఎలా చెప్పాలో తెలియలేదు అమ్మ నా పెళ్ళివిషయం మాట్లాడేందుకే పని పెట్టుకొని ఇక్కడకు వచ్చిండి.

"ఆ అమ్మాయి ఎమ్ బి. బి. యస్ చదువుతోంది పేరుసంధ్య. ఆమె అందం గుణాలూ అన్నీ నాకునచ్చాయి. అందుకే ఆ అమ్మాయిని నా అర్ధాంగిగా స్వీకరించాలనుకుంటున్నాను.

"తలిదండ్రులూ.... ఇతర వివరాలూ" అన్నది అమ్మ.

"వాళ్ళమ్మ టీచరు. వితంతువు. కులం మనకులమే...."

"అయితే వివరాలు కనుక్కో అన్నయ్యా!"

"సరే....మంచిరోజు చూసి వాళ్ళింటికి వెళ్ళు. పిల్లని నీవూ చూడాలిగా" అన్నాడు మామయ్య.

ఇంతలో మెట్లమీద చెప్పులశబ్దం వినిపించింది, మానాన్నగారికి దూరపుబంధువు విశ్వనాధంగారు. "ఏమ్మా సావిత్రీ! అంతా కులాసాయేనా" అన్నారు నా ప్రక్కనేకూర్చుంటూ

"కులాసాయే అన్నయ్యా" అంటూ తను వచ్చిన విషయం, నా ప్రేమగొడవ అన్నీ వివరించింది

"ఇంతకీ లక్ష్మీదేవి కూతురు కాదుగదా!" అన్నారు ఆతృతగా

"అవును. ఆవిడకూతురే"

"పిల్ల బంగారుబొమ్మ.... గుణవంతురాలే కాని"

"ఏం అన్నయ్యా....?"

"ఏముందమ్మా: లక్ష్మీదేవికి పరికిణీ, జాకెట్లవయస్సు దాటకముందే భర్తపోయాడుట. ఆవిడ అత్తారివూరే మా స్నేహితుడిది వాడే మొన్న లక్ష్మీదేవిని చూపించి చెప్పాడు.

"అయితే ఈ పిల్ల...."

"ఏమోనమ్మా అంతా భగవంతుడిలీలా విలాసం." అంటూ ఏవో మాట్లాడి జారుకున్నాడు.

"విన్నావుగా దివాకర్! తండ్రెవరో తెలియని పిల్లని ఎలా చేసుకుంటాం?"

"ఆ అమ్మాయి చాలా మంచిదమ్మా! ఏమైనా సంధ్యనాభార్య కావాలి." అన్నాను ఖచ్చితంగా,


రచన:

పి. కళ


"మన సాంప్రదాయం గౌరవం ఆలోచించి మాట్లాడు దివా! తండ్రెవరో తెలియని పిల్ల నా కోడలు కావటానికి నేను చచ్చినా అంగీకరించను" అంటూ నా సమాధానానికి ఎదురు చూడకుండానే క్రిందికి వెళ్ళిపోయింది. మామయ్య, అత్తయ్య ఒకరిముఖాలొకరు చూచుకున్నారు ఇంతవరకూ అత్తయ్య ఒక మాటయినా మాట్లాడకపోవడం ఆశ్చర్యంగా వుంది.

"ఏమంటావురా" అన్నాడు మామయ్య

"సంధ్యంటే నాకు చాలా యిష్టం మామయ్యా. తనకు నేను ప్రమాణం చేశా భార్యగా స్వీకరించుతానని',

ప్రచురణకు స్వీకరించిన పోటీ కథానిక

"మరి ఆపిల్లతండ్రెవరో....?"

"అవును మామయ్యా లక్ష్మీదేవిగారి భర్త చిన్నప్పుడేపోయాడని నాకూ తెల్సు. అయితే సంధ్య పుట్టాకే అనుకున్నాను. కాని నిజంయిదే అయినా సంధ్యను నిరాకరించలేను. జ్ఞానం తెలియకముందే భర్త పోయాడు. ఆవిడా మనిషే. మానవ సహజమైన వాంఛవలన ఆమె కాలు జారిందేమో! కానీ ఆవిడనుచూస్తే నీతిలేని మనిషిగా అనిపించదు. అత్తయ్యా నీవేం మాట్లాడవేం?" అన్నా

"నీవు చెప్పేది నిజమే దివా! కాని ఆవిడే ద్వితీయవివాహం చేసుకుంటే మీ అమ్మమాత్రం అడ్డుపెట్టేదంటావా....?" అన్నది అత్తయ్య.

"జరగనిదాన్ని గురించి ఆలోచనెందుకత్తయ్యా! అందరికీ విధవా వివాహానికి అవకాశాలుండొద్దూ! పోనీ తల్లి అవినీతిపరురాలే అనుకుందాం. ఆ తల్లిపేరుతో యీ బిడ్డనుకూడా ఆపాపంలోనే ముంచకపోతే ఎందుకు ఉద్ధరించకూడదూ...."

"నీవు చెప్పింది కరక్టే కాని మీ అమ్మ సంస్కారం యింకా అంతవరకూ పెరగలేదు దివా!"

"అమ్మను మార్చలేవా అత్తయ్యా"

"ప్రయత్నిస్తాను, కాని ఎంతవరకు సఫలీకృతురాల నవుతానో చెప్పలేను అయినా ఓ మారు లక్ష్మీదేవిగారింటికి తీసుకెళ్ళు నన్ను"

"ఎప్పుడు వెడతావు?"

"రేపు సాయంత్రం ఆవిడను చూచిగాని ఏం చెప్పను"

రాత్రి పడుకున్నా నన్నమాటేగాని నిద్ర పట్టడంలేదు. సంధ్య ఈ యేడే ఎమ్. బి. బి. యస్. మొదటి సంవత్సరం పూర్తిచేసింది. నేను ఆఖరు సంవత్సరం పరీక్షలు వ్రాశాను. ఈ సంవత్సర కాలంలో కొన్ని అనుకోని సంఘటనల వలన దగ్గరయి ఒకరిని విడిచి మరొకరం బ్రతకలేని స్థితికి వచ్చాము. అర్ధ

చంద్రుణ్ణి గుర్తు తెచ్చే పచ్చని ఫాలము పంచిన విల్లులాంటి భ్రుకుటి విశాలమైన అమాయిక నేత్రాలు. చక్కని నాసిక. ఎఱ్ఱని బుల్లి పెదిమలు. నునుపైన చెక్కిళ్ళ పిడికిలికి పట్టే సన్నని నడుం నాజూగ్గా పొడుగ్గా చూడగానే ఆకర్షించేస్తుంది. ఆమె పొడవైన వేణి పిరుదులపై నాట్యమాడుతూ హృదయంలో గిలిగింతలు పెడుతుంది. అమ్మను ఎదిర్చేదానికంటే ఎలాగో వప్పించడమే మంచిది అమ్మది చాల సున్నితమైన మనస్సు. తన బంధు వర్గంలోగాని మిత్రులలోగాని ఎవరికి కష్టం కలిగినా సహించలేదు. అటువంటిది కన్నబిడ్డ యిష్టానికి వ్యతిరేకం తన జీవితాన్ని దుఃఖభాజనం చేస్తుందా. అమ్మ మనసు మార్చాలి. అందుకు సమర్థురాలు అత్తయ్యే.

హైస్కూలు చదువుకని మామయ్యదగ్గర నన్నుంచారు. మామయ్య ఈ హైదరాబాద్ నగరంలో పేరు పొందిన డాక్టరు. అత్తయ్య పెంపకంలో ఆదర్శాలు గలవాడిగానూ, ఆలోచనా పరుడిగానూ తయారయ్యాను అందుకే అత్తయ్య అంటే నాకెంతో భక్తి గౌరవాలు. ఆవిడ సలహాలేకుండా నేనే పనీ చేయలేను.

ఉదయం నన్ను చూచిన ప్రతిక్షణం అమ్మ కోపాన్ని వెళ్ళగ్రక్కుతూనే ఉంది. సాయంత్రం అత్తయ్యను సంధ్య వాళ్ళింట్లో దింపి అటూ ఇటూ తిరిగి కొంచెం పొద్దు పోయాకే ఇంటికి చేరాను. సరాసరి డాబా మీదికివెళ్లాను వాతావరణం అతిగంభీరంగా ఉంది మామయ్య తెల్లని పడకపై పడుకొని ఆకాశంలో దశమి చంద్రుణ్ణి చూస్తున్నాడు అత్తయ్య పడక కుర్చీలో వాలి జాజితీగ ఆకులు తెంపుతూ ఆలోచించుతోంది. మామయ్య పక్కనే కూర్చుంటూ "కాయా పండా" అన్నాను.

"ఏదైనా మీ అమ్మ రైటో అనాలిగా ఎవరేమన్నా నీవు సంధ్యానాధుడవే కావాలని కోరుకుంటున్నావు గదా" అన్నది అత్తయ్య.

"వాళ్ళంటే నీ అభిప్రాయం"

"నిజం దివాకర్! నీవు సంధ్య అంటే ఎందుకంత వ్యామోహంలో పడ్డావో చూచాకగాని తెలుసుకోలేకపోయాను. వంకలేని అందం. అందానికి తగిన అణకువ, మర్యాదా మనల్ని ఇట్టే కట్టేస్తుంది. ఏదైనా ఆ తల్లి పెంపకం' అట్లాంటిది"

అత్తయ్య మాటలు వింటూంటే హృదయం ఆనందంతో వేగంగా స్పందించ సాగింది.

"లక్ష్మీదేవికూడా మెచ్చుకోతగిన స్త్రీ దివాకర్! ఎలా కాలుజారిందో తెలియటం లేదు.

"ఇంతకీ ఆవిడ పూర్వ చరిత్ర ఏమైనా తెలుసుకున్నావా!"

"వెళ్ళాక నన్ను చాల మర్యాద చేశారు ఏదో పిచ్చాపాటి అయ్యాక సంధ్యా వాళ్ళ నాన్నగారిది ఏ వూరని అడిగాను. ఆవిడ ఏం మాట్లాడలేదు. కళ్ళలో నీళ్ళుమాత్రం కన్పించాయి.

"ఆ వివరాలు చెప్పలేని స్థితిలో ఉన్నాను రుక్మిణీదేవీ! కాని మీకు కొంత తెలియపరచక తప్పదు. మనస్సూ, వయస్సూ వికసించకముందే వివాహం, వైధవ్యం అన్ని దశలూ జరిగిపోయినయ్. నిద్రావస్థలో నున్న నాలో స్త్రీత్వం ఒక యువకుని ప్రేమామృత వర్షధారలతో మేల్కొంది. తత్ఫలితంగా సంధ్యరూపు దాల్చింది."

"మిమ్మల్ని అతడెందుకు పెండ్లాడలేదు." అన్నాను.

"కాలం కలసి రాలేదు. జీవితంలో పొరపాటో గ్రహపాటో ఒకసారి జరిగిపోయింది. కాని ఆ అక్రమ సంబంధం తాలూకు విషఫలితాలు యీ నాటికి మాత్రం నన్ను విడవటంలేదు. నన్ను గురించి నాకెప్పుడూ బాధలేదు. సంఘంలో నా స్థితి ఎంత నీచంగా ఉన్నా ఫరవాలేదు. కాని సంధ్య నా బిడ్డ.... సుగుణాల ప్రోవు ఆ అమాయకురాలు మాత్రం బాధపడటం నేను సహించలేను. అంటూ ఆవిడ కన్నీరు కార్చింది. "దివాకర్‌తో వివాహం కాకపోతే మాత్రం సంధ్య జీవితం అడవి కాచిన వెన్నెలవుతుంది రుక్మిణీదేవి. మీరు నా బిడ్డ జీవితానికి వెలుగు ప్రసాదించండి" అంటూ నా చేతులు పట్టుకుంది. ఆవిడను ఓదార్చి ఏవో మంచిమాటలు చెప్పాను. తర్వాత మన కుటుంబాన్ని గూర్చికూడా అడిగింది. కొంచెంసేపుండి వచ్చేశాను."

"సంధ్యను గురించి...."

"నీవే నా బిడ్డవైతే ఎప్పుడో లగ్నాలు పెట్టించే దాన్ని దివా! కాని నీ కన్న తల్లిదండ్రుల అంగీకారం కావాలి" అత్తయ్య కంఠం గద్గదమయింది.

"నీ ఆదేశం ఏమిటి అత్తయ్యా"

"నేను వద్దంటే మాన గలవా!

"నీవు వద్దనవు గదా అత్తయ్యా! నీ పెంపకం వలననే నా కిలాటి భావాలు ఆశయాలు కలిగాయి"

"నీకు మంచనితోస్తే, ఆ పని చేయడంవలన సుఖమూ, తృప్తీ, ఆనందమూ లభించితే ధైర్యంగా చేసేయడమే మంచిది మీనాన్న వదిన ఎంతంటే అంత గదా! మీ అమ్మ కొన్నాళ్ళకు కోడలూ, కొడుకూ అంటూ పరుగెత్తుకొస్తుంది." అంటూ అత్తయ్య క్రిందికి వెళ్ళిపోయింది.

"నువ్వేం మాట్లాడవ్ మామయ్యా" అన్నాను.

"మీ అత్తయ్య కంటే బాగా మాట్లాడగలనటా? పద మనంకూడా కిందికి పోదాం." అంటూ మామయ్య లేచారు. వెనకనే నేనూ బయలుదేరాను.

అత్తయ్యకు ఆ తల్లీ బిడ్డలపై సదభిప్రాయం కలిగిందంటే నా మనస్సు ప్రశాంతంగా ఉంది రాత్రి హాయిగా నిద్ర పట్టింది. తలుపు ఎవరో దబదబా బాదేస్తుంటే మెలకువ వచ్చింది తెల్లవారింది కాని ఇంకా సూర్యోదయం

(తరువాయి 19 వ పేజీలో)

## వెలిగీ వెలగని దివ్వెలు

(14 వ పేజీ తరువాయి)

కాలేదు. తలుపుమీద ఇంకా దెబ్బలు పడుతూనే ఉన్నాయి లేచి హాల్లోకి వచ్చేటప్పటికీ మామయ్య తలుపు తీస్తూండటం చూచి నిలబడ్డాను అమ్మ, అత్తయ్య కూడా వచ్చారు. వచ్చింది ఎవరూ....! సంధ్య. రేగిన జుట్టూ, నలిగిన బట్టలూ చెక్కిళ్ళపై కన్నీటి ప్రవాహం.... మామయ్య కాళ్ళపైబడి వెక్కి వెక్కి ఏడవటం మొదలుపెట్టింది సంధ్య మామయ్య నెమ్మదిగా లేవనెత్తి ''ఏమిటమ్మా....!'' అన్నారు.

ఏవో కాయితాలు మామయ్యచేతిలో పెట్టింది. ''చదవరా దివాకర్ !'' అంటూ అవి నాచేతుల్లో పెట్టాడు మామయ్య.

చిరంజీవి సంధ్యా !

నా దీవెనలు. శుభాకాంక్షలు నేను బ్రతికిఉన్నంత వరకూ నీకు అందుతూనే వుంటాయి తల్లీ! నీకు జ్ఞానంవచ్చిన దగ్గర్నుంచి తల్లీ తండ్రీ బంధువు అందరూ నేనేయని పెంచానని నీకు తెలుసు ''మనకు బంధువులెవరూలేరా'' అనేదానివి నీవు ''లేరమ్మా! అలాఅడక్కు.'' అంటూ మాట మార్చేదాన్ని. నేను విధవనుకాబట్టి నీవు తండ్రిలేని బిడ్డగానే చూడబడ్డావు. కానీ లోకంనోరు మూయలేముగా! నా చరిత్ర నీకు చెప్పకతప్పదు. మా స్వంత ఊరు బందరు. కాని నాన్నమాత్రం బోర్డు స్కూలు టీచరవడంచేత అక్కడ వుండేవాళ్ళంకాదు. అమ్మకు చాలామందిపిల్లలు పుట్టి చచ్చిపోయారట. చివరకు నేను బ్రతికాను. ఎంతో గారంగా నడిస్తే కందిపోతానేమో అన్నట్లు పెంచారు. నాపేరు మీరంతా అనే లక్ష్మీదేవికాదు. రాధాలక్ష్మి. నన్నంతా రాధా అనే పిల్చేవారు. నాకు ఆరేళ్ళుంటాయనుకుంటాను. అమ్మమ్మకు ప్రాణాపాయంగా ఉందంటే అమ్మమ్మగారి ఊరు వెళ్ళాను. అమ్మమ్మ కడసారి కోర్కెగా వారంరోజుల్లో నాకూ బుల్లిమామయ్యకు పెళ్ళిజరిగిపోయింది. చచ్చిపోతుందనుకున్న అమ్మమ్మ విచిత్రంగా బ్రతికింది. కాని రెండేళ్ళు గడవకముందే బుల్లిమామయ్య మశూచితో మరణించాడు. అన్నం పున్నంఎరుగని ఎనిమిదేళ్ళ నాకు వైధవ్యం ప్రాప్తించింది. తెల్లపరికిణీ, తెల్లజాకెట్లతో ముఖానబొట్టులేకుండా బడికి వెళ్ళేదాన్ని. పదహారేళ్ళు నిండేసరికి ఎస్. ఎస్. ఎల్. సి. పూర్తిచేశాను నాన్న మంచి సంస్కారప్రియుడు. ''కాలేజీకి వెడతావా'' అన్నాడు, ''సెకండరీగ్రేడ్ ట్రెయినింగు చదువుతానన్నా. గుంటూరు కాన్వెంటులో ట్రెయినింగు చదివాను. బందరులో ఉద్యోగం వచ్చింది. నేనూ, నాయనమ్మ బందరువచ్చాము. ఇదివరకు అద్దెకుయిచ్చేసిన యిల్లు ఖాళీచేయించి కాపురము పెట్టాము.

మాప్రక్కమేడ మా అత్తయ్యగారిది, నాన్నగారికి ఓచెల్లెలుండేది. ఆవిడ ఇద్దరు మగపిల్లలూ; ఓఆడపిల్లా పుట్టాక చనిపోయింది. మామయ్య మళ్ళీపెళ్ళి చేసుకున్నాడు. ఆయనకు ఓవందెకరాల మాగాణీ ఓ లక్షరూపాయల రొక్కం ఉన్నాయని వినికిడి. పెదబావ శ్రీరామ్ లాయర్, చినబావ విశాఖలో డాక్టర్ చదువుతున్నాడు కూతురు సావిత్రిని బెజవాడదగ్గర పల్లెటూరిచ్చారు. దానికి అప్పుడే ఓమొగపిల్లవాడు. ఏమైనా అక్కరలు జరిగినా నాయనమ్మ, అమ్మ, నాన్న వెళ్ళేవారు ఎప్పుడయినా మామయ్య వచ్చేవారు. అందుకే వీళ్ళతో చనువూ, పరిచయంలేదు. కాని నేను బందరువచ్చాక శ్రీరామ్‌బావా, వారి అక్కయ్య సావిత్రివస్తూ పోతూండేవారు పెరటివైపు తలుపుతీస్తే వాళ్ళ పెరట్లోకి మేము వెళ్ళొచ్చు వాళ్ళు రావచ్చు. నన్ను చూచి, నా వైధవ్యజీవితాన్నిగూర్చి విచారించేవారు. మామయ్య చిన్నభార్యను అత్తయ్య అనేదాన్ని కాని ఆవిడమాత్రం మూతి విరిచేది. ఎందుకో అత్తయ్యను చూస్తే నాకు బెరుగ్గానే ఉండేది. పెద్దబావ భార్య వారిజ ఇంటర్ చదివింది. సంస్కారభావాలుగలది. నేనంటే పంచప్రాణాలు. స్కూలునుంచి వచ్చాక అక్కయ్యదగ్గరే కాలంగడిపేదానిని. సావిత్రివుంటే అది కూడమాతోబాటు సరదాగా కబుర్లుచెప్పేది. ఒక్కొక్కప్పుడు ''రాధీ! నువ్వు నాకంటె రెండునెలలు చిన్నదానవటే, మొగాడినైనా అయ్యానుకాదు. ఈ అందాన్ని వృధాపోనీయకుండా తనివితీరా త్రాగేసేదాన్ని'' అనేది.

''మీ ఆయనగా కనిపించిందేమిటి సావిత్రీ! రాధను అలా నలిపేస్తున్నావ్'' అనేది అక్కయ్య కొంటెగా....

''పోవదినా'' అంటూ మూతి ముడుచుకునేది సావిత్రి.

''నీవు మొగాడివైనా మీనాన్న చేసుకోనీయద్దూ.''

''పోదూ! తిడతాడు ఆస్థిలో భాగం పంచనంటాడు, అంతేగా.... ఈ ఆస్థి లేకపోతే మనం బ్రతకలేమటే రాధా!'' అనేది.

తనప్పుడే మొగాడయిపోయినట్లు. సావిత్రి వస్తుందంటే సంతోషం. వెళ్ళిపోతుందంటే విచారం. దాని కొడుక్కి రెండేళ్ళు ఉంటాయి. ఇంకా పేరు పెట్టకపోవడంచేత బాబ్జీ అని పిలిచేవాళ్ళు. వాడు నన్ను చూస్తే ఎగిరి గంతులు పెడుతుండేవాడు. కాలం దొర్లిపోతోంది. మల్లెలు, మామిడికాయల కాలందగ్గర కొచ్చింది. మామల్లెతీగను డాబాపైకి పాకించాను. పువ్వులు కోసి రోజూ వారి అక్కయ్య కిచ్చేదాన్ని. నాన్న వేసంగి సెలవలకు ఇక్కడకు రావటంలేదని నన్నే రమ్మని ఉత్తరం వ్రాశారు. నాయనమ్మ మాత్రం ఈ ఊరు వదలటానికి ఒప్పుకోలేదు. అందుకని ఆ వేసంగి బందరులో గడిపేయాలని నిశ్చయించాము. సాయంత్రం డాబామీద మల్లెపూలుకోసి క్రిందికి వస్తూండగా క్రొత్త కంఠం విన్పించింది.

''ఎప్పుడొచ్చావురా....'' అంటుంది నాయనమ్మ.

''మధ్యాహ్నం వచ్చానమ్మమ్మా ఎన్నాళ్ళకి కనిపించావే.

"మీ అమ్మే ఉంటే ఇలా ఉండేదా కృష్ణా! దానితోనే మీకూ మాకూ బంధుత్వం తెగిపోయింది."

"మేం ఉండగా ఎలా తెగిపోతుందే. రాధెక్కడ!" అన్నాడు అతను.

"డాబామీద ఉన్నట్లుంది.... 'వెళ్ళు'" అన్నది నాయనమ్మ.

మెట్లమీదనుంచి గబగబా పై గదిలోకి వచ్చాను. చినబావకృష్ణ అని తెలుసుకున్నాను. మాటలనుబట్టి. బూట్లచప్పుడు దగ్గరయినకొద్దీ నా హృదయం దడ దడ కొట్టుకోవడం మొదలుపెట్టింది చేతుల్లో గుమ్మాన్ని పట్టుకొని నిలబడ్డాడు. తలెత్తి చూచి తల దించుకున్నాను. కృష్ణబావ చామన ఛాయలో పొడుగ్గా, బలంగా ఉన్నాడు. విశాలమైన నేత్రాలు తెలివితో కళ కళ లాడుతున్నాయి. నుదుటపై దూకుతాననే ఒత్తయిన క్రాపు గిలిగింతలు కలిగించుతుంది. ముఖ్యంగా ఆ అందమైన నాసిక ఏ ఆడపిల్లకైనా ఉంటే ఆ పిల్లమీద ఎన్ని కవిత్వాలయినా అల్లేవారు కవులు పెదబావను చూస్తే పూజ్యభావం, గౌరవం కలుగుతుంటుంది. కాని చిన బావ హృదయంలో ప్రథమ వీక్షణంతోనే కల్లోలం కలిగించాడు.

"పంతులమ్మలుకూడా భిడియపడతారా రాధీ" అన్నాడు నవ్వుతూ నేనేం జవాబివ్వలేదు.

ఈ మూగపిల్ల బడిలో పాఠాలెలా చెప్తుంది చెప్మా" అన్నాడు ఆశ్చర్యం నటిస్తూ.

"శ్వేత సుందరిలా వున్నావు రాధీ"

ఆ కంఠంలో మార్దవం నన్ను కదిపేసింది. అప్రియత్నంగా కళ్ళలోనుండి నీళ్ళు చెక్కిళ్ళపై బడ్డాయి.

"అరె ఎందుకీ కన్నీళ్ళు! చక్కగా చదువుకున్నావు. ఉద్యోగం చేస్తున్నావ్! ధైర్యంగా ముందుకు నడిచి జీవితం సుఖమయం చేసుకోవాలి. కన్నీళ్ళు కష్టాలను తొలగించలేవు రాధీ!"

నా హృదయం ఆనందంతో నిండిపోయింది. అప్పటికి తెప్పరిల్లి కుర్చీ చూపుతూ "కూర్చో బావా!" అన్నాను.

"ధన్యుడను! మాటలకు మాణిక్యాలు రాలలేదుగదా!" అంటూ కుర్చీలో కూర్చున్నాడు.

"మాటలకే మాణిక్యాలు రాలితే ఇంకా ఈ బాధంతా ఎందుకు."

"నీకు తెలియదు రాధీ! అవి అందరకూ లభించవు అవి మాణిక్యాలని తెలుసుకునే శక్తికూడా అందరికీ ఉండాలి"

అయితే నువ్వు తెలుసుకున్నావన్న మాట."

"మేనత్త కొడుకును గదా ఆ మాత్రం తెలియదా"

తన కాలేజీ జీవితం హుషారుగా చిలిపిగా చెప్పుకుపోయాడు. నా స్కూలు విషయాలు తెలుసుకున్నాడు. బావ వెళ్ళాక ఏదో తెలియని వెల్తి కన్పించింది. నాలోని స్త్రీత్వం నిద్ర లేచిందా అనిపించి, రాత్రంతా ఏవో అల్లిబిల్లి ఆలోచనలలో నిద్ర పట్టలేదు. ఇలా ఓ వారం రోజులు గడిచిపోయాయి. వారి అక్కయ్య వాళ్ల అన్న పెళ్ళికి పెదబావతోసహా వెళ్ళింది. ఒక స్నేహితురాలు దూరమైనట్లనిపించింది అక్కయ్యవెళ్ళిన రెండోరోజు నేనూ నాయనమ్మ భోజనం చేయాలనుకుంటున్నాం. ఇంతలో బావ విసురుగా వచ్చి "అమ్మమ్మా! అన్నం పెట్టవే" అంటూ పెరట్లోకి వెళ్ళాడు.

అమ్మమ్మ బావకు అన్నంపెట్టి "అలా ఉన్నావేరా" అంది.

"వల్లకాడుగాని యిల్లుకాదు. అన్నం నిండా రాళ్ళు. కూరనిండా పురుగులు. వదిన వెళ్ళిందిగా మరి వంటవాళ్ళు, పని మనుషులు అంతకంటే బాగాచేస్తారా" అన్నాడు ధుమధుమలాడుతూ.

"మరి మీ పిన్ని...."

"ఆవిడ ఎప్పుడూ ఏపనీ చెయ్యదు, వదిన లేకపోతే యిల్లు నరకమే. అమ్మమ్మా. వదినా వచ్చేవరకు నే నిక్కడే భోజనం చేస్తాను."

నాయనమ్మ ముఖం ఆనందంతో నిండిపోయింది. నేనూ తక్కువ సంతోషం అనుభవించలేదు, బావకు వంటచేసి పెట్టడమంటే నాకెంతో ఆనందంగావుంది. ఒక రోజు భోజనంచేస్తూ "నిన్ను చేసుకున్న వాడినోరు చాలా పుణ్యం చేసుకున్నది రాధీ" అన్నాడు

"అనోటికి ఆ అదృష్టం పట్టకుండా ఎప్పుడో మట్టిలో కలసింది."

"అదీ ఒక పెళ్ళేనా ఏమిటి! నువ్వసలు బొట్టెందుకు పెట్టుకోవు."

అంటూ నావైపుచూచాడు. నాయనమ్మ ఎక్కడ వింటుందోనని అక్కడనుంచి వచ్చేశాను. రాత్రి బావకోసం చాలా సేపు ఎదురుచూసి భోజనంచేసి పడుకున్నాము. నాయనమ్మ మంచి గురకలో వుండగా తలుపు తట్టినశబ్దం వినిపించి లేచాను,

"సినిమాకెళ్ళాం రాధీ! అందుకే ఆలస్యమయింది" అంటూ లోపలికి వచ్చాడు. భోజనంచేస్తూ సినిమామీద విమర్శలు వినిపించాడు.

"ఇప్పుడు యింటికేం వెళ్ళను. పై గదిలో పడుకుంటాను. కొంచెం మంచి నీళ్ళుమాత్రం తెచ్చిపెట్టు." అంటూ పైకివెళ్ళాడు. పైన పక్కవలచి మంచి నీళ్ళు పెట్టాను. త్రియోదశి చంద్రుడు వెలుగులు ప్రసరించుతూ స్వచ్ఛంగా తెల్లగా నవ్వుతున్నాడు విచ్చిన మల్లెలు "[illegible]కు అందమేగాక సౌరంభంకూడా వుంది" అని చంద్రుని వెక్కిరించుతున్నాయి. తెల్లని పడకపై సిగరెట్లపొగలలో అందమైన నవయువకుడు.... హృదయము బరువెక్కింది. "వెళ్ళనాబావా" అన్నాను.

"ఉండమంటే వుంటావా!"

'అయినా నీవెందుకు వుండమంటావు'

"ఏం ఎందుకు ఉండమనకూడదు!" అంటూ దగ్గరకొచ్చాడు. గుండె వేగంగా కంపించసాగింది బావ ఒకచేత్తో నడుం

చుట్టి రెండోచేత్తో చుబుకాన్ని పైకెత్తుతూ "రాధీ! నీ జీవితం అడవిగాచిన వెన్నెల కానీయను." అంటూ పెదిమలపై ముద్దు పెట్టుకున్నాడు.

అంతే ఆరోజునుంచి పెరట్లో మాలతీ గుబురు మా ప్రణయ మందిరమయింది.

మళ్ళీ స్కూళ్ళు తెరిచారు, బావ వెళ్ళిపోయాడు. "నీలో ఏదో మార్పువచ్చింది రాధా" అంటూండేది వారిజక్కయ్య. నాకీ ఉత్సాహమంతా ఎలావచ్చిందో అక్కయ్యకేం తెలుసు. మా ప్రణయం చాల రహస్యంగా సాగిపోయింది. అందుకే యింకా ఐదోకంటికి తెలియలేదు.

దసరాకు, సంక్రాంతికి బావ రాడని తెలిసి అమ్మమ్మదగ్గరకు వెళ్ళాము. మళ్ళీ వేసవికాలంకోసం ఎదురుచూస్తూ తీయని తలపులతో కాలంగడిపేస్తున్నాను. ఎదురుచూస్తున్న వేసవికాలం వచ్చేసింది. శుభఘడియన బావకూడా వచ్చాడు ఐదారు రోజులు హాయిగాతీయగా వెళ్ళిపోయాయి. "రాధీ" అని పిలిచినట్లనిపించింది. పెరట్లోకి వచ్చాను ఎవరూ లేరు మాకూ మామయ్యగారికీ ఉన్న మధ్యగుమ్మం దగ్గరకు వచ్చాను. అటునుంచి అడుగుల చప్పుడు వినిపించింది. అవి నాకు సుపరిచితమైన బావ పదధ్వనులు. ఇంతలో వెనక "కృష్ణా" అనేస్వరం వినిపించింది. అది వారిజక్కయ్య కంఠం.

"కృష్ణా! మీమధ్య ప్రణయాన్ని నేను కనిపెడుతూనేవున్నాను. కాని అది ఎంతవరకు సబబో ఆలోచించావా!"

"వదినా! కాలం కలసిరాలేదుగాని లేకపోతే మేముదంపతులం అయ్యేవాళ్ళం'

'"అవునయ్యా స్త్రీజీవితం అరిటాకులాంటిది. తర్వాత ఆపిల్లగతేమిటో ఆలోచించు. లోకంకళ్ళు ఎన్నాళ్ళు మూస్తావ్"

"నేను రాధను పెళ్ళాడాలనుకుంటున్నాను. ఏనాడోజరిగిపోయిన అదీ ఒక పెళ్ళేనా! నీవు విజ్ఞానవతివిగదా రాధను పెళ్ళాడటం తప్పంటావా!"

"తప్పనను. పైగా ప్రోత్సహించుతాను. కాని మీనాన్నగారు సనాతనాచార సాంప్రదాయులు. వారుమాత్రం అంగీకరించరు."

నా చదువు పూర్తయ్యాక నేను నాకాళ్ళ మీద నిలబడగలిగినప్పుడే రాధని భార్యగా స్వీకరించుతాను."

"నీ చదువు పూర్తికావాలంటే ఇంకా రెండేళ్ళు గడవాలి. ఈ లోగా...."

"ఈ లోపున...."

"ఏదైనా అవాంతరం వస్తే"

"అంటే...."

"అందుకే నీది పసి మనస్సంటాను కృష్ణా! పెళ్ళికాకపోయినా మీరు భార్యాభర్తల్లానే మెలుగుతున్నారు. ఈ లోపున రాధలో నీ ప్రతిబింబం రూపుతాల్చితే సంఘంలో రాధ స్థితి, చివరకు రాధ గతి" బావ మౌనం వహించాడు. ఏం సమాధానం చెప్తాడో అని నేను ఆతృతగా చెవులు రిక్కించి వింటున్నాను.

'డాక్టరువుగదు కృష్ణా కడుపు తీయిం'

"భ్రూణహత్యా....!"

"మరి మార్గమేమిటో చెప్పు అంతకంటే!"

"వదినా! స్త్రీగాని పురుషుడుగాని తొలిగా తల్లి తండ్రి అవుతున్నారంటే ఎంత ఆనందపడతారో స్త్రీవి గనుక నీవూ ఊహించగలవు గదా! అలాంటి సమయాల్లో ఎన్నో వేడుకలుచేసి తమ ఆనందాన్ని ప్రకటించుకుంటారే.... మరి నా ప్రథమ సంతానంపై నాకా మమత ఉండదూ!"

"ఉండటం సహజం నాయనా! కాని లోకంలో జరిగిపోతుంది ఇలాగే."

"నేను మాత్రం అలా జరగనీయను డాక్టర్ని కాలేక పోయినా నాభార్యా బిడ్డలను పోషించుకోలేకపోను. అందులో రాధ కూడా నాతో సహకరించుతుంది. మా పొట్టలే నిండవంటావా!"

"పొట్ట నిండటం గొప్ప సంగతి కాదయ్యా! నీవు డాక్టరువై ఎంతో కీర్తి గడించుతావని. ఎంతో గొప్పవాడివౌతావని తలచే మా ఎంటివారికి ఇదెంత గొడ్డలిపెట్టు. క్షణికావేశానికిలోనై జీవితాన్ని, భవిష్యత్ని నాశనం చేసుకుంటావా!"

"మరేం చేయమంటావు వదినా!"

"రేపట్నుంచీ ఈ సమావేశాలు మానేయ్యండి కృష్ణా! రెండు సంవత్సరాలంటే ఎంత బాబూ! మధ్యలో బ్రతుకు అభాసు కాకుండా రెండు విధాల విజయం సంపాదించవచ్చు. తనకోసం నీ భవిష్యత్ నాశనం కావటం రాధమాత్రం సహించగలదంటావా! ఇలా అన్నానని కోపం వచ్చిందా కృష్ణా!"

"మంచి చెబితే కోపించేంతటి మూర్ఖుడినా వదినా! కన్నతల్లి ఆప్యాయత. ప్రేమ అంటూ తెలియని నాకునీనుండిమాతృహృదయాన్ని చూడగలుగుతున్నాను. నాద్వితీయ మాతృమూర్తి కెప్పుడూ అంజలులు సమర్పించుతూనే ఉంటాను."

"రాధ నీకోసం ఎదురుచూస్తూంటుంది. ఆ పిల్లనుకూడా ఈ విషయం చెప్పు వెళ్ళు"

నేను వెనక్కితిరిగి మాలతిగుబురువద్ద నిలబడ్డాను. బావనుచూస్తూ. "ఎంతసేపు నిరీక్షించాలో నీకోసం"

"వదిన ఆపేసిందిరాధా" అంటూ నేను విన్నవన్నీ తనూ చెప్పాడు.

"అక్కయ్య చెప్పినట్లే చేద్దాం,"

"నీకు తెలియదు రాధీ. పరిస్థితులు ఎలాంటిపనైనా చేయనిస్తాయి. నాచదువుపోయినా నాభవిష్యత్పోయినా నీవు మాత్రం నాదానివే." అంటూబావ నాచేత ప్రమాణం చేయించుకున్నాడు. బావవెళ్ళిపోయాడు. కానీ జరగవలసిందేదో అప్పుడే జరిగిపోయింది. నాలో నాకు మార్పుకనిపించుతుంది. అక్కయ్య ముందే యీసలహా యిస్తే ఎంతబావుండేది, ఈ పరిస్థితిలో ఏంచేయాలి. బావకు ఉత్తరం వ్రాస్తే మరుక్షణమే వ్రాలతాడు. కాని అతనిబ్రతుకు రసాభాసం అవుతుంది.

ముందు జీవితం అంధకారమవుతుంది.... గుమాస్తా ఉద్యోగం, చాలీచాలని జీతం.... మురికికూపంలాంటి బ్రతుకు బావకువద్దు! బాగా చదవాలి.... పేరుపొందాలి. నాన్నగారికి తెలిస్తే నన్ను బ్రతకనిస్తారా! చచ్చిపోతే.... అంతనిరాశలేదు. బ్రతుకుపైఆశ అందులో బావసంతానాన్ని క్షేమముగా అతనికి అందించాలి. ఏంచేయాలి? స్కూలుకు వెళ్ళివస్తున్నాను. రోజులు గడచినకొద్దీ బ్రతుకుపై విరక్తి.... కడుపులో భారం పెరుగుతూవుంది వారిజక్కయ్యతో చెప్పాలనుకున్నాను. కాని చెప్పలేకపోయాను మా హెడ్‌మిస్ట్రెస్ దేవకీదేవికి నేనంటే చాలయిష్టం. ఆమె చదువుకొనే రోజుల్లో ప్రేమించే మోసపోయిందట. అందుకే ఇప్పటికీ కుమారిగానే ఉండిపోయిందంటారు. ఓ సాయంత్రం పిలుచుకొని వాళ్లయింటికి వెళ్ళాను. ఏవో మామూలుమాటలు అయ్యాక "రాధా నీలో చాలామార్పు వచ్చింది. పూర్వంలా ఉత్సాహంగాలేవు. యిలా అయిపోవటానికి కారణం తెలియటంలేదు." అన్నారు అప్యాయంగా.

నాకథంతా వివరంగా చెప్పాను. "ఏం చేయాలనుకుంటున్నావు.?

"అదే తెలియడంలేదు మేడమ్! ఇలా జరుగుతుందని కల్లోకూడా అనుకోలేదు. నావలన బావజీవితం నాశనంకావడం నాకిష్టంలేదు. నాకిప్పుడు వేటిమీదమమత లేదు. ఈ పరిసరాలకు దూరంగా బావ ప్రతిబింబాన్ని రక్షించుకునేశక్తి సంపాదించేస్థితికావాలి...." అన్నాను.

"హైదరాబాద్‌లో మాఫ్రెండ్ ఓమిడిల్ స్కూలు హెడ్ మిస్ట్రెస్‌గా చేస్తోంది. అవిడకు లెటర్‌వ్రాస్తాను నిన్ను తప్పక ఆదరిస్తుంది. ఆవిడకు నీకథ చెప్పకు. భర్తపోయి నెలరోజులే అయినట్లు మూడో నెల గర్భిణీ అనిమాత్రం వ్రాస్తాను. నీవు అలాగేచెప్పు." అన్నారావిడ.

"సరే" నంటూ ఆవిడకు శతకోటి నమస్కారాలర్పించాను. వారిజక్కయ్యకు ఫలానాచోటుకు వెడుతున్నానని వ్రాయకుండా ఎందుకు వెళ్ళిపోతుందీ వ్రాసి ఒక రాత్రి రైలెక్కాను దేవకీదేవి ఫ్రెండ్ తనయింట్లోనే ఉంచుకొని తనస్కూల్లో ఉద్యోగం యిప్పించింది. నేను వచ్చిన రెండేళ్ళకే అవిడ రిటైరయి మద్రాసు కూతురుదగ్గరకు వెళ్ళిపోయింది. చిన్నబావ వాళ్ళ అమూకీ నాకు తర్వాత ఎంత ప్రయత్నించినా తెలియలేదు. నడతవలననైతేనేమి, పనివలననైతేనేమి అందరిమెప్పులూ సంపాదించాను. నావయస్సు ఎక్కువైనా మనిషిలో అట్టేమార్పురాలేదు. అందుకే తెలిసినవారు గుర్తుపట్టి దివాకర్ తలిదండ్రులకు చెప్పివుంటారు. అసలు నేనే చెప్పేయాలనుకున్నాను.

భగవంతుడు కడుదయామయుడని రుక్మిణివచ్చి వెళ్ళాక తెలుసుకున్నాను. రుక్మిణి ఎవరోకాదు వారిజక్కయ్య స్వంతసోదరి బావకు ఎప్పుడో తన ప్రథమ సంతానమైన నిన్ను అప్పగించాలనుకున్నాను కాని యింత దగ్గర్లో ఆ శుభ ఘడియ ఉందనుకోలేదు. దివాకర్‌ని అతి ప్రేమతో పెంచి పెద్దచేసిన మేనమామ నీకు రూపు నిచ్చిన తండ్రి. నీ అందమైన ముక్కు అయనదే. కళ్ళు నీవే కాని వానిలో భావాలు నీ తండ్రివి మొగాడినైతే నన్ను పెండ్లాడుతానన్న సావిత్రి నన్ను కోడలుగా ఎందుకు చేసుకోదు? సావిత్రి హృదయం నిన్ను కాదనేందుకు అంగీకరించుతుందా! దివాకర్‌తో వివాహం సంభవంకాదేమోనని నీవు బాధపడటం నేను చూచాను. కాని ఇప్పుడు నాకా భయంలేదు. దివాకర్.... వాడే నన్ను చూచి ఎగిరిపడే బాబీగాడు నీకు తప్పక భర్త అవుతాడు వారిజక్కయ్య సహృదయురాలైన రుక్మిణి నిన్ను ఇద్దరు తల్లుల ముద్దుల బిడ్డగా కను పాపలలో దాచు కుంటారు. మీనాన్న కృష్ణ క్రింద నడిస్తే అరిగి పోతావేమోనన్నట్లు పెంచుతాడు. భగవంతుడు బాల్యంలో బంధు వియోగం యౌవనంలో మాతృవియోగం నీ నొసటన వ్రాశాడు తల్లీ! నన్నుకూడా వారు సహృదయంతో ఆదరించుతారు. కాని ప్రశాంతమైన కొలనులో గులక రాయిలా పడటం నాకిష్టం లేదు. అందుకే ఈ విశాల విశ్వంలో నా చోటెక్కడా అని వెతుక్కుంటూ వెళ్ళిపోతున్నాను.

నీ తల్లి రాధాలక్ష్మి.

చదివి తలెత్తి చూచాను. నా కంఠం గద్గదమయింది. కళ్ళు నీళ్ళతో నిండాయి. అత్తయ్య మామయ్యలుకూడా అదే స్థితిలో ఉన్నారు. అమ్మ వెక్కి వెక్కి ఏడుస్తూ సంధ్యను దగ్గరకు తీసుకుంది. అంత విషాదంలోకూడా లక్ష్మిదేవి నాకు అత్తయ్య అనీ సంధ్య నా మేనమామ ప్రతిరూపమని అనుకుంటే ఎంతో ఆనందం కలిగింది.

ఒక్కసారి అత్తయ్య కన్పించకూడదూ! బాబీ.... దివాకర్.... దివాలుగ పిలవకూడదూ! అప్పుడేం చేస్తాను? నా వయస్సూ హోదా. అన్నీ వదిలి ఆమె పాదాల్ని కళ్ళ కద్దుకుంటాను. దివా అని పదిసార్లు పిలిపించుకుంటాను

పెళ్ళి పందిర కళకళలాడుతోంది. మామయ్య ముఖం గంభీరంతో నిండిపోయి వుంది. సంధ్య కనులలో విషాద ఛాయలు అవరించాయి! తను ప్రేమించిన వాడు భర్త అవుతున్నాడని సంతోషపడుతుందా! ఇలాంటి శుభసమయంలో కష్టాలను సహించి పెంచిన మాతృమూర్తి లేదని బాధపడుతుందా! రుక్మిణత్తయ్య, కృష్ణ మామయ్య కాళ్ళు కడిగి కన్యాదానం చేశారు నాకు!

తులసికోటవద్ద ప్రమిద మసక మసగ్గా వెలుగుతోంది. ప్రమిదలో నూనె అయితే ఉంది కాని వత్తి పైకి త్రోసి ప్రకాశింపజేసే వాళ్ళేలేదు. అయితే కొడిగట్టి ఎప్పుడో క్షీణించిపోతుంది. ఒక్క నిట్టూర్పు విడిచి లోపలికి వచ్చాను.

